
సాక్షి ఒడిశా


బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
నగదు రూ.3,52,938
వెండి 5 గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



బీజేపీలో అసంతృప్తుల జ్వాల
భారతీయ జనతా పార్టీ టిక్కెట్ల కేటాయింపు తర్వాత ఆ పార్టీలో అసంతృప్తి జ్వాలలు రేగాయి.
- 8లో



ఇఫ్తార్ సెహరి
బుధ గురు
6.07 4.23
రంజాన్ వేళలు

సమరానికి సై..!

- రాష్ట్రంలో పెరిగిన రాజకీయ వేడి
- ఒకేరోజు బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాలు విడుదల
- ఉత్సాహంలో పార్టీల శ్రేణులు



కమలం వికసించేనా..!

- తొలి జాబితాలో 112 మంది ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటన

భువనేశ్వర్/రాయగడ: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల కోసం అభ్యర్థుల ఖరారు ప్రక్రియ క్రమంగా ముగింపు దశకు చేరుకుంటోంది. భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో 147 అసెంబ్లీ స్థానాల్లో 112 స్థానాలకు మంగళవారం అభ్యర్థులను ప్రకటించింది. ఈ జాబితాలో పలువురు ప్రముఖులకు టికెట్లు ఖరారు కావడం విశేషం. వీరిలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ (చాంద్‌బాలీ), ప్రతిపక్ష నేత జయ నారాయణ్ మిశ్రా (సంబల్‌పూర్), మాజీ ప్రతిపక్ష నేత ప్రదీప్త నాయక్ (భవానీపట్న), రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు కనక వర్ధన్ సింగ్‌దేవ్ (పట్నాగఢ్) ఉన్నారు. జాబితా వెల్లడి పురస్కరించుకుని కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థును మార్చి ప్రత్యర్థికి ధీటైన రీతిలో రంగం సిద్ధం చేసింది. పూరీ జిల్లా బ్రహ్మగిరి నియోజకవర్గంలో లలితేందు బిద్యాధర్ మహాపాత్రోని మార్చి ఆయన స్థానంలో దివంగత సోదరుడు, కాంగ్రెసు నాయకుని కుమార్తె ఉపాసన మహాపాత్రోకు టిక్కెట్టు కేటాయించింది. లలితేందు బిద్యాధర మహాపాత్రో మినహా అత్యధిక సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మరోసారి పోటీ చేసేందుకు అభ్యర్థిత్వం ఖరారు అయింది. లోక్‌సభ టిక్కెట్ నిరాకరించిన బర్‌గడ్ ఎంపీ సురేష్ పూజారి బ్రజరాజ్‌నగర్ నుంచి శాసనసభకు పోటీ చేయనున్నారు. అయితే అసెంబ్లీ అభ్యర్థుల తొలి జాబితాలో లోక్‌సభ పోటీకి అవకాశం పొందని నితీష్ గంగదేవ్, బసంత కుమార్ పండా, కేంద్రమంత్రి బిశేశ్వర్ టుడు వంటి ఎంపీలు జాడ లేకపోవడం విశేషం. మరోవైపు బసంత కుమార్ పండా కుమారుడు అభినందన్ కుమార్ పండాకు నువాపడా నుంచి పార్టీ టిక్కెట్ కేటాయించింది. పటకురా నియోజకవర్గం నుంచి యువ నేత తేజేశ్వర్ పరిడా, భట్లీ నుంచి ఇరాసిస్ ఆచార్య, ఝార్సుగుడ నుంచి టొంకొధొరొ త్రిపాఠిలను కూడా బీజేపీ బరిలోకి దింపింది.

వలస అభ్యర్థులకు అవకాశం

అధికార పక్షం బిజూ జనతా దళ్ నుంచి ఇటీవల వైదొలిగి బీజేపీలో అడుగిడిన సినీ నటులు ఆకాష్ దాస్‌నాయక్‌కు కొర్రై, సిద్ధాంత్ మహాపాత్రోను దిగొపాహండి స్థానాల నుంచి పోటీకి నిలిపింది. మరో బీజేడీ ఫిరాయింపుదారు, జయదేవ్ నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే అరబింద ధాలీని అదే స్థానం నుంచి పోటీ చేసేందుకు బీజేపీ అభ్యర్థిత్వం ఖరారు చేసింది. భువనేశ్వర్ లోక్‌సభ మాజీ సభ్యుడు డాక్టర్ ప్రసన్న కుమార్ పటసహాణి అల్లుడు, మాజీ ఎమ్మెల్యే ప్రియదర్శి మిశ్రాకు భువనేశ్వర్ (ఉత్తర) నియోజకవర్గం టిక్కెట్టు ఇచ్చారు. ప్రియదర్శి ఇటీవల బీజేడీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. బీజేడీని వీడి గత నెల 26న బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే పూర్ణ చంద్ర సెఠిని ఖల్లికోట్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి అవకాశం కల్పించారు. 2009, 2014లో నియోజకవర్గం నుంచి వరుసగా 2 సార్లు గెలిచిన ఆయనకు 2019లో టిక్కెట్టు నిరాకరించారు. కంధమల్ లోక్‌సభ మాజీ సభ్యురాలు ప్రత్యూష రాజేశ్వరి సింగ్‌కు నయాగఢ్ నుంచి పోటీ చేసేందుకు బీజేపీ అవకాశం కల్పించింది. 2019 ఎన్నికల్లో పోటీకి బీజేడీ టికెట్ నిరాకరించడంతో ఆమె బీజేపీలో చేరారు. అలాగే కాంగ్రెస్ మాజీ శాసన సభ్యుడు నిహార్ మహానందకు అట్టాబిరా నియోజకవర్గం నుంచి అభ్యర్థిగా బీజేపీ ప్రకటించింది. రాష్ట్రంలో 21 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల జాబితాను భారతీయ జనతా పార్టీ ఇదివరకే విడుదల చేసిన విషయం తెలిసిందే.

సిట్టింగులకు అవకాశం

బీజేపీ ప్రకటించిన జాబితాలో సింహ భాగం సిట్టింగ్ అభ్యర్థులే ఉన్నారు. 22 మంది సిట్టింగ్ బీజేపీ ఎమ్మెల్యేల్లో 17 మందికి తాజా పోటీకి అభ్యర్థులుగా ప్రకటించడం విశేషం. ఈ లెక్కన 77 శాతం పునరావృతమైంది. సిట్టింగ్ ఎమ్మెల్యే అరబింద ధాలీకి జయదేవ్ నియోజకవర్గం లభించడంతో సమగ్రంగా 18 మంది ఎమ్మెల్యేలకు అవకాశం పునరావృతం అయినట్లు తొలి జాబితా స్పష్టం చేసింది. తొలి జాబితాలో 112 మంది అభ్యర్థుల్లో 8 మంది మహిళా అభ్యర్థులుని ఖరారు చేయడంతో తొలి జాబితాలో మహిళల ప్రాతినిధ్యం 7.14 శాతానికి పరిమితమైంది. అలాగే బీజేడీని విడిచిపెట్టి బీజేపీలో చేరిన 4 మంది అభ్యర్థులకు పోటీకి నిలబెట్టి ఆదరించింది. కొన్నిచోట్ల లోక్‌సభకు పోటీ నిరాకరించిన వారికి శాసనసభ స్థానంలో పోటీకి బరిలోకి దింపగా, మరికొన్ని చోట్ల పార్లమెంట్‌కు పోటీకి అవకాశం చిక్కని వారి కుటుంబీకులకు తొలి జాబితాలో టికెట్లు లభించాయి.

గంజాం నుంచి అత్యధికం

112 మందితో బీజేపీ జారీ చేసిన అభ్యర్థుల తొలి జాబితాలో అత్యధికంగా గంజాం జిల్లా అభ్యర్థులు చోటు చేసుకున్నారు. గంజాం జిల్లాలో సమగ్రంగా 13 శాసనసభ నియోజకవర్గాలు ఉండగా 12 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయడం విశేషం. ఈ జిల్లా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సొంత జిల్లా. ఈ జిల్లాలో హింజిలికాట్ నుంచి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పోటీ చేయనున్నారు. ఆయనతో తలపడేందుకు బీజేపీ శిశిర్ మిశ్రాని బరిలోకి దింపింది.

అభ్యర్థులు వీరే...

శాసనసభ నియోజకవర్గం	అభ్యర్థి
పద్మపూర్	గోవర్ధన్ భోయ్
బీజేపూర్	శనత్ కుమార్ గరటియా
బరఘడ్	అశ్విని కుమార్ షడంగి
అత్తాబీర (ఎస్సీ)	నిహారి రంజన్ మహానంద
భటిలి	ఇరాశిష్ ఆచార్య
బ్రజరాజ్‌నగర్	సురేష్ పూజారి
ఝార్సుగుడ	టంకధర్ త్రిపాఠి
తలసర (ఎస్టీ)	భవానీ శంకర్ భోయ్
సుందర్‌ఘడ్ (ఎస్టీ)	కుసుమ్ టేటే
బీరమిత్రపూర్ (ఎస్టీ)	శంకర్ ఒరమ్
రఘునాథ్‌పల్లి (ఎస్సీ)	దుర్గా చరణ్ తంటి
రాజ్‌గంగపూర్ (ఎస్టీ)	నరసింగ మింజా
బొనాయ్ (ఎస్టీ)	సేబతి నాయక్
కుచింద (ఎస్టీ)	రవినారాయణ్ నాయక్
సంబల్‌పూర్	జయనారాయణ్ మిశ్రా
రైరాఖోల్	దేవేంద్ర మహాపాత్రో
దేవఘర్	సుభాష్ చంద్ర పాణిగ్రాహి
ఆనందపూర్ (ఎస్సీ)	అలోక్ కుమార్ శెఠి
కేంఝర్ (ఎస్టీ)	మోహన్ చరణ్ మాఝి
జాషిపూర్ (ఎస్టీ)	గణేష్ రాం సింగ్ ఖుంటియా
ఉదాల (ఎస్టీ)	భాస్కర్ మధాయి
బడాసాహి (ఎస్సీ)	సనాతన్ బిజులి
బరిపద (ఎస్టీ)	ప్రకాష్ సోరెన్
మొరడ	డాక్టర్ కృష్ణచంద్ర మహాపాత్రో
జలేశ్వర్	బ్రజ ప్రధాన్
బాలేశ్వర్	మానస్ కుమార్ దత్త
రెమున (ఎస్సీ)	గోవింద చంద్రదాస్
సొరొ (ఎస్సీ)	రాజేంద్ర దాస్
సిములియా	పద్మలోచన్ పండ
భద్రక్	సొతాంప శేఖర్ మహాపాత్రో
ధమానగర్ (ఎస్సీ)	సూర్యవంశీ సూరజ్
చందాబలి	మన్మోహన్ సామల్
బింజహాపూర్ (ఎస్సీ)	బబితా మాలిక్
బర్చన	అమర్ కుమార్ నాయక్
ధర్మశాల	స్మృతిరేఖ పాహి
జాజ్‌పూర్	గౌతం రాయ్

శాసనసభ నియోజకవర్గం	అభ్యర్థి
కొరాయి	ఆకష్ దాస్ నాయక్
సుకింద	ప్రదీప్ బాలసమంతా
ఢెంకనాల్	కృష్ణచంద్ర పాత్రో
కామాఖ్యనగర్	శత్రుఘన్ జెన్న
పరజంగ	బిభూతి భూషణ్ ప్రధాన్
పల్లహార	అశోక్ మహంతి
తాల్చేర్	కాళి చరణ్ సామల్
అనుగూల్	ప్రతాప్ చంద్ర ప్రధాన్
ఛెహెండిపడ(ఎస్సీ)	అగస్తి బెహర
అత్తమాలిక్	సంజీవ్ సాహు
బీర్‌మహారాజ్‌పూర్ (ఎస్సీ)	రఘునాథ్ జగడాల
సోన్‌పూర్	ప్రమోద్ మహాపాత్రో
లొయిసింగ (ఎస్సీ)	డాక్టర్ ముఖేష్ మహాలింగ్
పట్నాఘర్	కనకవర్ధన్ సింగ్ దేవ్
బలంగీర్	గోపాల్ పాణిగ్రహి
టిటలాఘడ్	నవీన్ జైన్
కంటాబంజి	లక్ష్మణ్ బాగ్
నువాపడ	అభినందన్ కుమార్ పండ
ఖరియార్	హితేష్ కుమార్ భగర్తి
ఉమ్మర్‌కొట్ (ఎస్టీ)	నిత్యానంద గొండ
నవరంగపూర్ (ఎస్టీ)	గౌరిశంకర్ మాఝి
లంజిఘర్ (ఎస్టీ)	రమేష్ చంద్ర మాఝి
జున్నాఘడ్	మనోజ్ కుమార్ మెహెర్
ధర్మఘడ్	సుధీర్ పట్టజోషి
భవాణిపట్న (ఎస్సీ)	ప్రదీప్త కుమార్ నాయక్
నర్ల	అనిరుద్ధ ప్రధాన్
బలిగుడ (ఎస్టీ)	కల్పన కుమారి కన్హర్
జి.ఉదయగిరి (ఎస్టీ)	మనగోవింద ప్రధాన్
పుల్బాణి (ఎస్టీ)	ఉమాచరణ్ మాలిక్
కంటామాల్	కన్హయ్ చరణ్ దంగ
బౌధ్	సరోజ్ ప్రధాన్
బరంబ	సంబిత్ త్రిపాఠి
బంకి	తుషాకాంత్ చక్రవర్తి
అత్తాఘర్	అభయ కుమార్ బారిక్
ఛౌద్వార్-కటక్	నయన్ కిషోర్ మహంతి
నియాలి (ఎస్సీ)	ఛబీ మల్లిక్
కటక్-సదర్ (ఎస్సీ)	ప్రకాష్ చంద్ర శెఠి
మహంగ	సుమంత్ కుమార్ ఘడేయి

శాసనసభ నియోజకవర్గం	అభ్యర్థి
అవుల్	కృష్ణచంద్ర పండ
మహాకాల్‌పడ	డాక్టర్ దుర్గా ప్రసన్న నాయక్
పారాదీప్	సంపద్ కుమార్ స్వయి
తిర్తోల్ (ఎస్సీ)	రాజ్ కిషోర్ బెహర
నిమాపర	పార్వతి పరిడ
పూరి	జయంత కుమార్ సరంగి
బ్రహ్మగిరి	ఉపాసన మహాపాత్రో
సత్యవాది	ఓం ప్రకాష్ మిశ్రా
పిపిలి	ఆశ్రిత్ కుమార్ పట్నాయక్
జయదేవ్ (ఎస్సీ)	అరబింద ధాలి
భువనేశ్వర్ సెంట్రల్	జగన్నాథ్ ప్రధాన్
భువనేశ్వర్ నార్త్	ప్రియదర్శిని మిశ్రా
ఏకాంరా-భువనేశ్వర్	బాబు సింగ్
జట్నీ	విశ్వరంజన్ బడజెన
చిలిక	పృథ్వీరాజ్ హరిచందన్
రాన్‌పూర్	తపస్ రంజన్ మార్థ
ఖండపడ	దుశ్యంత స్వయి
దసపల్ల (ఎస్సీ)	రాఘవ మల్లిక్
నయాఘర్	ప్రత్యూష రాజేశ్వరి సింగ్
భంజనగర్	ప్రద్యుమ్న కుమార్ నాయక్
పొలసర	గోకులనంద మల్లిక్
కవిసూర్యనగర్	ప్రతాప్ చంద్ర నాయక్
ఖల్లికోట్ (ఎస్సీ)	పూర్ణచంద్ర శెఠి
ఛత్రపూర్ (ఎస్సీ)	కృష్ణచంద్ర నాయక్
అస్కా	సరోజ్ కుమార్ పాఢి
సురడ	నీలమణి బిషోయ్
హింజిలి	శిశిర్ మిశ్రా
గోపాల్‌పూర్	బిభూతిభూషన్ జెన్న
బరంపురం	కె.అనిల్ కుమార్
దిగపొహండి	సిద్దంత్ మహాపాత్రో
చికిటి	మనోరంజన్ ద్యాన్ సామంతరాయ్
పర్లాకిమిడి	కె.నారాయణరావు
గుణుపూర్ (ఎస్టీ)	త్రినాథ్ గొమాంగో
కొరాపుట్ (ఎస్టీ)	రఘురాం మాచ్ఛ
పొట్టంగి (ఎస్టీ)	చైతన్య హంటాల్
మల్కన్‌గిరి (ఎస్టీ)	నరసింహ మడ్కామి

ఐఎన్‌డీఐఏ ఆశలు నెరవేరేనా..?

- కూటమి తొలి జాబితా వెల్లడి
- 47 అసెంబ్లీ, 8 లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు
- ఇతరులకు రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయింపు

భువనేశ్వర్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని ఐఎన్‌డీఐఏ కూటమి ఎనిమిది లోక్‌సభ, 49 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల తొలి జాబితాను మంగళవారం ప్రకటించింది. ఈ జాబితాలో తొలి రెండు దశల పోలింగ్‌కు చెందిన నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు అధికంగా ఉన్నారు. తొలి దశ మే 13న 4 లోక్‌సభ, 28 అసెంబ్లీ స్థానాలకు, మలి దశ మే 20న 5 లోక్‌సభ, 35 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. 9 మంది సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో 5 మంది అభ్యర్థిత్వం ఖరారైంది. 2 స్థానాలను కూటమి వర్గాలకు కేటాయించింది. వీటిలో బొణై మరియు బీరమిత్రపూర్ నియోజకవర్గాలు ఉన్నాయి. కాంగ్రెసు తొలి జాబితాలో మహిళలు, క్రీడాకారులకు ప్రాధాన్యత కల్పించింది. ఈ జాబితాలో 5 మంది మహిళలను బరిలో దింపేందుకు ఖరారు చేసింది. సిట్టింగ్ ఎంపీ సప్తగిరి ఉలాకాను కొరాపుట్ పార్లమెంటరీ నియోజకవర్గానికి పార్టీ తిరిగి అభ్యర్థిగా ప్రకటించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) విడుదల చేసిన జాబితా ప్రకారం మాజీ ఎంపీ సంజయ్ భొయ్ బర్‌గఢ్ లోక్‌సభ స్థానం నుంచి, జనార్దన్ దెహురి సుందరగడ్ నుంచి పోటీ చేయనున్నారు. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన సినీ నటుడు మనోజ్ మిశ్రా బొలంగీర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. ప్రత్యక్ష ఎన్నికల పోరు ఆయనకు ఇదే తొలిసారి కావడం విశేషం. మాజీ ఎమ్మెల్యే భుజబల్ మాఝీ నవరంగ్‌పూర్ నియోజకవర్గం నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు.


రస్మి రంజన్ పట్నాయక్


సప్తగిరి ఉలాక


జనర్దన్ దేహరి


మనోజ్ మిశ్రో


ద్రౌపది మాఝీ


అమీర్ చాంద్ నాయక్

అసెంబ్లీకి ప్రముఖులు

ఒడిశా ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ (ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్, ఒడిశా కాంగ్రెస్ ప్రచార కమిటీ చీఫ్ భక్త చరణ్ దాస్, ఒడిశా కాంగ్రెస్ ప్రచార కమిటీ సమన్వయకర్త బిజయ్ కుమార్ పట్నాయక్ సహా పలువురు కాంగ్రెస్ ప్రముఖులు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ నువాపడా నుంచి, మాజీ చీఫ్ సెక్రటరీ బిజయ్ కుమార్ పట్నాయక్ పర్లాకిమిడి నుంచి పోటీ చేయనున్నారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు ప్రబోధ్ టిర్కీ తాలాసారా, కిషోర్ పటేల్ బ్రజరాజ్‌నగర్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు రమేష్ చంద్ర జెనా, తారా ప్రసాద్ బాహిణీపతి, సంతోష్ సింగ్ సలూజాలను పార్టీ తిరిగి అభ్యర్థులుగా ప్రకటించింది. బిజూ జనతా దళ్ ఫిరాయించిన బలభద్ర మాఝికి లంజిగఢ్ అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ టిక్కెట్ కేటాయించింది. మాజీ ఎమ్మెల్యేలు కిషోర్ చంద్ర పటేల్, రామచంద్ర కదం అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగనున్నారు. అదేవిధంగా సీనియర్ నాయకుడు నరసింహ మిశ్రా కుమారుడు సమరేంద్ర మిశ్రా, భక్త చరణ్ దాస్ కొడుకు సాగర్ చరణ్ దాస్‌లు బొలంగీర్, భవానీపట్న నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తారు. బీరమిత్రపూర్ శాసనసభ స్థానం జార్ఖండ్ ముక్తి మోర్చాకు, బొణై (ఎస్టీ) స్థానం భారతీయ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)కి కేటాయించారు.


భుజబల్ మఝి


సంజయ్ బోయి

ఎమ్మెల్యే అభ్యర్థులు వీరే...

నియోజకవర్గం	అభ్యర్థి
పదంపూర్	టొంకొధర్ సాహు
బిజేపూర్	కిషోర్ దఫాదర్
బర్‌గడ్	నిపోన్ కుమార్ దాస్
భట్లీ	బ్రహ్మ మహాకుడు
బ్రజరాజ్‌నగర్	కిషోర్ చంద్ర పటేల్
తాలాసారా (ఎస్టీ)	ప్రబోధ్ టిర్కీ
సుందర్‌గడ్ (ఎస్టీ)	సుధారాణి రౌడియా
బీరమిత్రపూర్	జేఎంఎం అభ్యర్థి
రఘునాథపల్లి (ఎస్సీ)	గోపాల్ దాస్
రౌర్కెలా	బీరేంద్రనాథ్ పట్నాయక్
రాజ్‌గంగ్‌పూర్ (ఎస్టీ)	డాక్టర్ సి.ఎస్.రాజెన్ ఎక్కా
బొణై (ఎస్టీ)	సీపీఐ(ఎం) అభ్యర్థి
లొయిసింగ (ఎస్సీ)	ఓం ప్రకాష్ కుంభార్
పట్నాగడ్	అనీల్ మెహెర్
బొలంగీర్	సమరేంద్ర మిశ్రా
కంటాబంజీ	సంతోష్ సింగ్ సలూజా
నువాపడా	శరత్ పట్నాయక్
ఉమర్‌కోట్ (ఎస్టీ)	సన్‌రాజ్ గోండ్
ఝొరిగాంవ్ (ఎస్టీ)	హరబతి గోండ్
నవరంగ్‌పూర్ (ఎస్టీ)	దిలీప్ ప్రధాన్
డాబుగాంవ్ (ఎస్టీ)	డా.లిపికా మాఝీ
లంజిగడ్ (ఎస్టీ)	బలభద్ర మాఝీ
జునాగడ్	తులేశ్వర్ నాయక్
ధర్మగడ్	రశ్మిరేఖ రౌత్

నియోజకవర్గం	అభ్యర్థి
భవానీపట్న (ఎస్సీ)	సాగర్ చరణ్ దాస్
నౌర్ల	భక్త చరణ్ దాస్
బలిగుడ (ఎస్టీ)	సురడ ప్రధాన్
జి. ఉదయగిరి (ఎస్టీ)	ప్రఫుల్ల చంద్ర ప్రధాన్
ఫుల్బాణి (ఎస్టీ)	ప్రతిభ కన్హర్
కొంటామల్	మనోజ్ కుమార్ ఆచార్య
బౌధ్	నొబొ కుమార్ మిశ్రా
భంజనగర్	ప్రశాంత బిసోయి
పొలాసార	అగస్తి బొరొద
కవిసూర్యనగర్	చిరంజీవి బిసోయి
సురడా	హరికృష్ణ రథ్
సన్నొఖెముండి	రమేష్ చంద్ర జెనా
చికిటి	రవీంద్ర నాథ్ ద్యానసామంతరాయ్
మోహన	దాశరథి గోమాంగో
పర్లాకిమిడి	బిజయ్ కుమార్ పట్నాయక్
గుణుపురం	సత్యజిత్ గొమాంగో
బిసం కటక్	నీలమాధబ్ హికాకా
రాయగడ (ఎస్టీ)	కడర్క అల్లపస్వామి
లక్ష్మీపూర్ (ఎస్టీ)	పబిత్ర సునీత
కోట్‌పాడు (ఎస్టీ)	అనామ దియాన్
జయపురం	తారా ప్రసాద్ బాహిణీపతి
కొరాపుట్ (ఎస్సీ)	కృష్ణచంద్ర కులదీప్
పొట్టంగి (ఎస్టీ)	రామచంద్ర కదం
మల్కన్‌గిరి (ఎస్టీ)	మాల మాఢి
చిత్రకొండ (ఎస్టీ)	మంగు ఖిల్లా

లోక్‌సభ అభ్యర్థులు వీరే...

బర్‌గడ్	సంజయ్ భోయ్
సుందర్‌గడ్	జనార్దన్ దెహురి
బొలంగీర్	మనోజ్ మిశ్రా
కలహండి	ద్రౌపది మాఝీ
నవరంగ్‌పూర్	భుజబల్ మాఝీ
కందమల్	అమీర్ చాంద్ నాయక్
బరంపురం	రస్మీ రంజన్ పట్నాయక్
కొరాపుట్	సప్తగిరి ఉలాకా

దగ్ధమవుతున్న అడవులు


నట్టిడొంగర అడవిలో మంటలు


మంటలను అదుపు చేస్తున్న అటవీ ఉద్యోగి

జయపురం: కొరాపుట్ జిల్లాలో ప్రతీ ఏడాది అడవులు అగ్నికి ఆహుతవ్వడం సర్వసాధారణమైంది. అందుకు గిరిజనుల పోడు వ్యవసాయం, ఆదిమ కాలం నుంచి వస్తున్న షిఫ్టింగ్ కల్టివేషన్ ఒక కారణంగా భావిస్తున్నారు. ఈ మేరకు అగ్ని ప్రమాదాలు నివారించేందుకు గ్రామీణ, ఆదివాసీ ప్రజలను చైతన్యపరచేందుకు అటవీ అధికారులు, సిబ్బంది పలు సచేతన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినా అడవుల్లో అగ్ని ప్రమాదాలను అరికట్టడం జరగడం లేదు. గత కొన్ని రోజులుగా జయపురం అటవీ డివిజన్‌లో గొడొపాదర్, బరిణిపుట్ సమీప నట్టిడొంగర పర్వతం పైన, టంకువ, కేవిడి, రాణిగుడ, డొంగరచించి, పంపుణి మొదలగు పలు ప్రాంతాల్లో అడవులు దగ్ధమవుతున్నాయి. అంతేకాకుండ జయపురం అటవీ డివిజన్ సమీపంలో ఉన్న పినాకినీ రిజర్వ్ ఫారెస్టులో కూడా గత 15 రోజుల్లో రెండు సార్లు అడవిలో అగ్ని ప్రమాదాలు జరిగాయి. అందువలన అటవీ సిబ్బంది పక్కాగా చర్యలు చేపట్టి అగ్ని ప్రమాదాలు కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

ఇవే నాకు చివరి ఎన్నికలు

- కేంద్ర మాజీ మంత్రి జుయెల్ ఓరం ప్రకటన

భువనేశ్వర్: యువ నాయకులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో వచ్చే ఎన్నికల నుంచి తాను పోటీ చేయనని, ఇవే తనకు చివరి ఎన్నికలని బీజేపీ ఎంపీ, మాజీ కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జుయెల్ ఓరం ప్రకటించారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో సుందరగడ్ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. ఈ ఎన్నికల్లో విజయం తనకు ఆరో విడత పార్లమెంట్ ప్రాతినిధ్యానికి అవకాశం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సుందర్‌గఢ్ నుంచి బీజేపీ తనకు అభ్యర్థిగా బరిలో నిలపడం ఇది వరుసగా ఏడోసారి. ఈ లోక్‌సభ ఎన్నికలే తనకు చివరి ఎన్నికలుగా పేర్కొన్నారు. యువతకు ప్రత్యక్ష రాజకీయాల్లో రాణించేందుకు అవకాశం కల్పించాలన్న దృక్పథంతో ఆయన తదుపరి ఎన్నికల్లో పోటీచేసేది లేదని ప్రకటించారు. ఈసారి ఆయన ప్రఖ్యాత హాకీ క్రీడాకారుడు, భారత హాకీ అధ్యక్షుడు, బిజూ జనతా దళ్ అభ్యర్థి పద్మశ్రీ దిలీప్ తిర్కితో పోటీ పడనున్నారు. 2014 ఎన్నికల్లో 18,829 ఓట్ల తేడాతో దిలీప్ తిర్కీపై విజయం సాధించిన జుయెల్ ఓరం మరోసారి తలపడనున్నారు. ఇదే పరిస్థితి పునరావృతమైతే ప్రఖ్యాత క్రీడాకారునిపై వరుసగా రెండోసారి విజయం సాధించినట్లు అవుతుంది. వీరివురి మధ్య పోరు హోరాహోరీగా ఉంటుందని భావిస్తున్నారు. లోగడ 1998, 1999, 2004లో అతను వరుసగా విజయాలు సాధించారు. దళిత నాయకుడు దిలీప్ తిర్కీ 2014 నుంచి 2019 వరకు కేంద్రంలోని అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం

బరంపురం: స్థానిక బరంపురం క్రీడా మైదానంలో బరంపురం ఉప జిల్లా పాలన యంత్రాంగం ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్ మంగళవారం ప్రారంభమైంది. వారం రోజుల పాటు జరగనున్న ఈ క్యాంప్‌లో బాస్కెట్ బాల్, వాలీబాల్, రన్నింగ్, కబడ్డీ, ఖో–ఖో వంటి వివిధ క్రీడలపై శిక్షణ ఇవ్వనున్నట్లు కోజ్ కాజల్ తెలియజేశారు. నగరంలోని 30 ఉన్నత పాఠశాలలకు చెందిన 10వ తరగతి, 9వ తరగతి విద్యార్థులు 80 మంది కోచింగ్ తీసుకుంటున్నారని వెల్లడించారు.

భారీగా గంజాయి స్వాధీనం

బరంపురం: గంజాం జిల్లా పులసర పోలీసులు 96 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని సంబంధిత నిందితుడిని అరెస్టు చేసిన ఘటన స్థానికంగా సంచలనం రేపింది. ఐఐసీ అధికారి బాబనంద ప్రధాన్ తెలిపిన వివరాల మేరకు.. పులసర పోలీసుస్టేషన్ పరిధి కంత్రబడ గ్రామంలో ఒక ఇంటిలో గంజాయి నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఇంటిపై దాడిచేసి 96 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఒక నిందితుడిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి సురాజ్ చొట్రాయిగా గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గంజాం సుమారు రూ.5 లక్షలు ఖరీదు చేస్తుందని వెల్లడించారు.


అరెస్టైన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

కిడ్నీ నుంచి 6 సెంటీమీటర్ల రాయి తొలగింపు



రోగి కిడ్నీ నుంచి తొలగించిన 6 సెంటీమీటర్ల రాయి

అరసవల్లి: నగరంలోని గ్లోబల్ న్యూరోకేర్ ఆస్పత్రి వైద్యులు బొడ్డేపల్లి యోగేష్ (యూరాలజిస్ట్), గొనప భవాని (అనస్థీషియాలజిస్ట్)ల ఆధ్వర్యంలో ఓ రోగి కిడ్నీ నుంచి ఏకంగా 6 సెంటీమీటర్ల రాయిని తొలిగించామని ఆస్పత్రి ఎండీ దేవిరెడ్డి గౌతమ్ తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఈ వివరాలను వెల్లడించారు. సాధారణంగా కిడ్నీలో 0.5 సెంటీమీటర్ల రాయి ఉంటేనే శస్త్రచికిత్సలు చేస్తామని, అలాంటిది అరుదుగా 6 సెంటీమీటర్ల రాయి ఉండడం గుర్తించి వెంటనే తొలిగించామని ప్రకటించారు. రోగి ఆరోగ్యంగానే ఉన్నారని ఎండీ తెలిపారు.

ఎన్నికల బరిలో కాంగ్రెస్

శ్రీకాకుళం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అసెంబ్లీ నియోజకవర్గాల్లో శ్రీకాకుళంలో పైడి నాగభూషణరావు, ఆమదాలవలసలో సనపల అన్నాజీరావు, ఎచ్చెర్లలో కరిమజ్జి మల్లేశ్వరరావు, నరసన్నపేటలో మంత్రి నరసింహమూర్తి, పలసలో మజ్జి త్రినాథబాబు, పాతపట్నంలో కొప్పురోతు వెంకటరావు, ఇచ్ఛాపురంలో మాసుపత్రి చక్రవర్తి రెడ్డి పోటీ చేస్తారని పార్టీ అధిష్టానం ప్రకటించింది. అలాగే శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థిగా పేడాడ పరమేశ్వరరావు, విజయనగరం పార్లమెంట్ అభ్యర్థిగా రమేష్ పోటీ చేస్తారని పేర్కొంది. టెక్కలి అభ్యర్థి పేరును ఇంకా ఖరారు చేయలేదు.

నాలుగు ఎకరాల జీడి మామిడి పంట దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గార: శ్రీకూర్మం పంచాయతీ నగరాలపేట, చుక్కపేట గ్రామాల పరిధిలో జరిగిన అగ్ని ప్రమాదంలో పలువురు రైతులకు చెందిన నాలుగు ఎకరాల పొలంలోని జీడి మామిడి, కొబ్బరి చెట్లు, మామిడి చెట్లు, సర్వే చెట్లు దగ్ధమయ్యాయి. ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో ప్రమాదం చోటుచేసుకోవడంతో మంటలు ఎక్కువగా వ్యాపించాయి. స్థానికులు వెంటనే అధికారులకు సమాచారమివ్వడంతో తహసీల్దార్ ఎం.శ్రీను సంఘటన స్థలానికి చేరుకున్నారు. వెంటనే అగ్నిమాపక శాఖాధికారులకు ఫోన్ చేసి మంటలార్పించే ప్రయత్నాలు చేశారు. ఈ ఘటనలో చుక్కపేట, నగరాలపేటకు చెందిన పలువురు రైతులున్నారు. కొన్ని చెట్లు పూర్తిగా కాలిపోవడంతో నష్టం వచ్చిందని రైతులంటున్నారు.

వరకట్న వేధింపులపై ఫిర్యాదు

కంచిలి: భర్త, అత్త, మామ, ఆడపడుచులు అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నారని కంచిలి మండలం అరవ సరియాపల్లి గ్రామానికి చెందిన బుడ్డెపు కృష్ణవేణి కంచిలి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. తనకు 2022 ఫిబ్రవరి 4న కామేష్‌తో వివాహమైందని, పెళ్లయిన 3 నెలల నుంచి భర్తతోపాటు మామ రామయ్య, అత్త రాములమ్మ, ఆడపడుచు నిర్మల, వరుసకు మరిది ప్రసాద్‌లు శారీరకంగా, మానసికంగా వేధిస్తూ అదనంగా రూ.1,50,000 వరకట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని, ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, కంప్యూటర్ అకౌంటెన్సీ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 19 నుంచి 45 మధ్య వయస్సు ఉన్న యువకులు అర్హులు కాగా, ఈ నెల 10 నుంచి బ్యాచ్ ప్రారంభిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు 9553410809, 799 3340407 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పోస్టల్ సూపరింటెండెంట్‌గా హరిబాబు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా తపాలా శాఖ నూతన సూపరింటెండెంట్‌గా వందాన హరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం జిల్లా తపాలాశాఖ కార్యాలయంలో హరిబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో అనంతపురంలో తపాలా శాఖ సూపరింటెండెంట్‌గా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తపాలాశాఖ అభివృద్ధికి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. తపాలా శాఖ ద్వారా వివిధ రకాల పొదుపు పథకాలు, బీమా, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సేవలను అందిస్తామని తెలిపారు.

మహాలక్ష్మి అవతారంలో తరతరణి





దక్షిణ ఒడిశా ప్రజల ఆరాధ్య దైవం, రుశికుల్యా నదీతీరం పక్కన కొండపై కొలువైన తరతరణి అమ్మవారి రెండో చైత్ర మంగళవారం ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొండపై కొలువై ఉన్న తరతరిణి అమ్మవారు మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల వందలాది గ్రామల నుంచి ప్రజలు తరలివచ్చారు. పలువురు తలనీలాలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కొండ దిగువన వంటావార్పులు చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి మధ్యాహ్నం రాజభోగం, సాయంత్రం సంధ్యా హారతి, రాత్రి బేడా చేపట్టి ప్రత్యేక రథంలో తిరువీధి నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని సౌకర్యాలు చేపట్టామని కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి తిరుముల కుమార్ రెడ్డి తెలియజేశారు. శాంతి భద్రతలు పర్యవేక్షించేందుకు ప్రత్యేక పోలీసు బలగాలు మోహరించినట్లు ఎస్పీ జగ్‌మోహన్ మీన వెల్లడించారు.

– బరంపురం



ఉగాది ప్రచార రథం ప్రారంభం



ఉగాది ప్రచార రథం

రాయగడ: స్థానిక తేజస్వీ హోటల్ ఓపెన్ గ్రౌండ్‌లో ఈనెల 9, 10వ తేదీల్లో జరిగే ఉగాది ఉత్సవాలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు మంగళవారం నుంచి వివిధ పోటీలను నిర్వహిస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ప్రచార రథాన్ని ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు చంద్రమౌలి కుముంధాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా ఉగాది ఉత్సవాలను అంతా కలిసి ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలు, చిన్నారులను ప్రోత్సహించేవిధంగా ఈ ఏడాది కూడా వివిధ పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈనెల 8వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్న నేపథ్యంలో అందుకు సంబంధించి ఉత్సాహవంతులు, ఆసక్తి కనబరిచే ప్రతీ ఒక్కరూ ఈ పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అత్యధిక శాతం మంది ఈ పోటీల్లో పాల్గొనేలా ముందుగా ప్రచారాన్ని కొనసాగించేందుకు ప్రచార రథాన్ని ఏర్పాటు చేశామన్నారు.

ప్రతీ ప్రాంతంలో ఈ రథం తిరిగి నిర్వహించే పోటీలకు సంబంధించి ప్రజలకు చైతన్య పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఉగాది ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీలో అసంతృప్తుల జ్వాల



బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో పలు ప్రాంతాల కార్యకర్తల రచ్చ

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ టిక్కెట్ల కేటాయింపు తర్వాత ఆ పార్టీలో అసంతృప్తి జ్వాలలు రేగాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి అసమ్మతివాదుల అనుచరులు, అభిమానులు స్థానిక రాష్ట్ర కార్యాలయానికి చేరుకొని మంగళవారం సాయంత్రం తీవ్రస్థాయిలో రచ్చ చేశారు. దీంతో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో గందరగోళం చెలరేగింది. ప్రధానంగా ధర్మశాల అసెంబ్లీ నియోజకవర్గంలో స్మృతి రేఖ పాహికి టిక్కెట్టు కేటాయించడంపై ఆ ప్రాంతపు కార్యకర్తలు రెచ్చిపోయారు. ధర్మశాల నియోజకవర్గంలో హిమాన్సు శేఖర్ సాహూ బలమైన అభ్యర్థి. బీజేపీ నుంచి పోటీ చేసేందుకు ఆయనకు టిక్కెట్టు నిరాకరించారు. దీంతో కొత్త ముఖానికి కేటాయించడాన్ని నిరసిస్తూ ఆయన మద్దతుదారులు వందలాది మంది పార్టీ కార్యాలయాన్ని ముట్టడించారు. పాహి టికెట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలనే నినాదంతో ఆందోళనతో ప్రాంగణం దద్దరిల్లింది. హిమాన్సు మద్దతుదారులు భారీ ర్యాలీ నిర్వహించి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. హిమాన్సుకు మద్దతుగా 25,000 మందికి పైగా ఆ ర్యాలీలో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు. ఈ విషయమై సీనియర్ నేతల నుంచి ఎలాంటి స్పందన లేదు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ



పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక సెంటర్ ఫర్ కమ్యూనిటీ డవలప్‌మెంట్(సీసీడీ), గజపతి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లును జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్ పాత్రో చేతులమీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ పాత్రో మాట్లాడుతూ.. క్షయవ్యాధి వలన శరీరంలో రోగ నిరోధక శక్తి తగ్గిపోతుందన్నారు.

భారత ప్రభుత్వం ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ ద్వారా క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేస్తోందని తెలియజేశారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆస్పత్రిల్లో ప్రత్యేక ట్రీట్‌మెంట్ జరుగుతుందని, కానీ ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి వీరికి పౌష్టికాహారం అందజేస్తే కోలుకుంటారని పేర్కొన్నారు. మొత్తం 20 మందికి పాలు, శనగలు, ఖర్జూరం, బియ్యం, పప్పులు, నూనెలు వంటి రూ.1500 విలువజేసే కిట్లును అందజేశారు. కార్యక్రమంలో సీసీడీ సంస్థ కార్యదర్శి అడ్డాల జగన్నాథ రాజు, డీపీఎం సౌమ్య రాణి గౌడో, వాకర్స్ క్లబ్ సభ్యులు సంజయ్ జెన్నా, ఊనా సంతోష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పరిశీలకుల నియామకం

భువనేశ్వర్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రత్యేక పరిశీలకులను మంగళవారం నియమించింది. ఓటరుని ప్రలోభ పరచడం, బెదిరించడం, భయపెట్టడం ఇతరేతర ఎన్నికల సంబంధిత అవాంఛనీయ కదలికలపై ప్రత్యేక పరిశీలకుల నిఘా ఉంటుందని ఈసీఐ తెలిపింది. అలాగే తప్పుడు సమాచారంపై అభిప్రాయాలతో అప్రమత్త పర్యవేక్షణ కోసం వీరిని నియమించడం విశేషం. ప్రత్యేక పరిశీలకులు (పోలీస్ మరియు జనరల్) అనుబంధ రంగాల్లో నైపుణ్యం మరియు ఎన్నికల ప్రక్రియలతో విశేష అనుభవం కలిగిన మాజీ సివిల్ సర్వీసు అధికారులుగా ఈసీఐ పేర్కొంది. ఎన్నికల సిబ్బంది, భద్రతా బలగాలు, ఓటింగ్ యంత్రాల కార్యకలాపాలను పర్యవేక్షించే కీలకమైన పనిని వీరికి అప్పగించారు. ఎన్నికల రంగంలో ప్రజాస్వామ్య ప్రక్రియను అణచివేసే ప్రయత్నాలను ఈ పరిశీలకులు అడుకట్ట వేస్తారు. రాష్ట్రానికి ప్రత్యేక వ్యయ పరిశీలకుడిని కూడా నియమించారు. ధనబలం, అక్రమ మద్యం పంపిణీ, వస్తు రూపంలో పంపిణీల నివారణపై వీరు దృష్టి సారిస్తారు. రాష్ట్రంలో సాధారణ వర్గం ప్రత్యేక పర్యవేక్షకునిగా విశ్రాంత ఐఏఎస్ యోగేంద్ర త్రిపాఠి, పోలీస్ స్పెషల్ అబ్జర్వర్‌గా విశ్రాంత ఐపీఎస్ రజనీకాంత్ మిశ్రాలు నియమితులయ్యారు.

పంచాయతీరాజ్ కార్యదర్శి పర్యటన



మిషన్ శక్తి మహిళలతో సునీల్ కుమార్ లోహని తదితరులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితిలో రాష్ట్ర పంచాయతీ రాజ్ కార్యదర్శి సునీల్ కుమార్ లోహని పర్యటించారు. ముందుగా ఆయన స్వాభిమాన్ ఏరియాలో ఉన్న పంచాయతీల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టోనెల్ క్యాంప్ వద్ద సర్పంచ్‌లతో పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం చిత్రకొండ మిషన్ శక్తి కేఫ్‌లో భోజనం చేశారు. బోడపోదర్ పంచాయతీకి వెళ్లి వసుద యోజన తాగునీటి ప్రాజెక్టును, చిత్రకొండ జగన్నాథ్ మందిరాన్ని సందర్శించి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ పవార్ సైన్ ప్రకాష్, పంచాయతీరాజ్ అదనపు కార్యదర్శి అరవింద డోకువ, చిత్రకొండ సమితి అధికారి తన్మయి పాస్, చిత్రకొండ తహసీల్దార్ నట్బర్ గార్డ్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్



పాలీసెట్ స్టడీ మెటీరియర్ ప్రదర్శిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గురుగు బెల్లి దామోదర్‌రావు, కన్వీనర్ పి.యుగంధర్‌రావు.

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిసెట్ – 2024కు ఉచిత కోచింగ్ అందజేసి స్టడీ మెటీరియల్ కూడా అందజేయనున్నట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్ రావు, పాలిసెట్ సెట్ జిల్లా కన్వీనర్ పి.యుగంధర్ రావు తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వివరాలు వెల్లడించారు. జిల్లాలో ఐదు ప్రభుత్వ, ఐదు ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయని చెప్పారు. ఈ నెల 27న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 5వ తేదీతో దరఖాస్తుల స్వీకరణ ముగుస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరణ కొనసాగుతోందని, శ్రీకాకుళం, టెక్కలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో సహాయ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆధార్ కార్డు, 10వ తరగతి హాల్ టిక్కెట్ ఆధారంగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 1 నుంచి ఉచిత కోచింగ్ ప్రారంభమైందని, ఈ నెల 25 వరకు కోచింగ్ ఉంటుందని తెలిపారు. వారాంతపు మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గణితం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందజేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9912342008 నంబర్‌ను సంప్రదించాలని చెప్పారు.

ఎస్‌బీఐలో రుణాల కలకలం!

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలోని బజారు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచిలో రుణాల కలకలం రేగింది. కొందరు సిబ్బంది ఉన్నతాధికారుల సహకారంతో కస్టమర్ల పేరిట రుణాలు వాడుకొని తిరిగి చెల్లించనట్లు సమాచారం. మూడు రోజులుగా బ్యాంకులో జరుగుతున్న అంతర్గత ఆడిట్‌లో ఈ వ్యవహారం వెలుగుచూసినట్లు తెలిసింది. నకిలీ (ప్రభుత్వ ఉద్యోగుల) పేర్లతో బ్యాంకు సిబ్బంది రుణాలు రూ.3 కోట్లు వరకూ వాడుకొని గుట్టుచప్పుడు కాకుండా లావాదేవీలు నడుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఎవరెవరి పేరిట ఈ రుణాలు వాడుకున్నారే విషయం బయట పడటంలేదు. తక్కువ వడ్డీకి బ్యాంకులో రుణాలు వస్తాయనే ఉద్దేశంతో బ్యాంకు సిబ్బంది కొందరు ప్రభుత్వ ఉద్యోగుల పేరున రుణాలు వాడుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్యాంకులో ఉన్న ఖాతాదారులైన ప్రభుత్వ ఉద్యోగులు తమకు పర్సనల్ లోన్లు కావాలని, ఎడ్యుకేషన్ రుణాలు కావాలని దరఖాస్తులు చేస్తుంటారు. అందులో కొందరికి రుణాలు మంజూరవుతాయి. మరికొందరికి రుణాలు మంజూరు కావు. ఇటువంటి వారి పేర్లను బ్యాంకు ఉద్యోగులు తమకు అనుకూలంగా మలుచుకొని వారి పేరిట రుణాలు వాడుకొని వాయిదాలు చెల్లిస్తున్నట్లు సమాచారం. గత కొంత కాలంగా ఈ విధంగా వాడుకున్న రుణ వాయిదాలు బ్యాంకు సిబ్బంది చెల్లించకపోవడంతో ఆడిట్‌లో బయట పడినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఖాతాదారులకు ఎటువంటి నష్టం జరగకపోయినా బ్యాంకు సిబ్బంది ఇతరుల పేరున తప్పుడు లావాదేవీలు చేయడం నేరమే అవుతుందని బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ విధంగా ఎవరెవరి పేరున ఏ బ్యాంకు ఉద్యోగులు రుణాలు వాడుకున్నారో అనేది తేలాల్సి ఉంది. మంగళవారం సాయంత్రం 7 గంటల వరకూ బ్యాంకు సిబ్బంది పరిశీలన చేశారు. ఈ విషయమై బ్రాంచి మేనేజర్ శ్రీకర్ వద్ద ప్రస్తావించగా ఈ బ్యాంకులో ఎటువంటి రుణాల గందరగోళం జరగలేదని, ప్రతీ నెలా జరుగుతున్నట్లుగానే ఆడిట్ జరిగిందని తెలిపారు. ఈ ఆడిట్‌కు అంత ప్రాధాన్యత లేదని స్పష్టం చేశారు.

జెమ్స్‌కు అరుదైన గుర్తింపు

- 'రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్' అక్రిడేషన్ లభించిన తొలి వైద్య కళాశాలగా రికార్డు



అవార్డు స్వీకరిస్తున్న చీఫ్ మెంటార్ బొల్లినేని భాస్కరావు

శ్రీకాకుళం రూరల్: జిల్లాలోని రాగోలులో జెమ్స్ ఆసుపత్రి అరుదైన గుర్తింపు సాధించింది. శస్త్ర చికిత్స, వైద్య కళాశాలల్లో రెండు దశాబ్దాల చరిత్ర కలిగి ప్రపంచంలోనే పేరొందిన లండన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇంగ్లాండ్ కళాశాల నుంచి అక్రిడేషన్ లభించిందని జెమ్స్ కళాశాల యాజమాన్యం, ఆంకాలజిస్ట్ పద్మశ్రీ డాక్టర్ రఘురామ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా చీఫ్ మెంటార్ బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ తమ కళాశాలకు ఈ గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్నారు. గత ఏడాది రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్ బృందం తమ కళాశాలను సందర్శించి ఇక్కడి బోధన, వైద్య సదుపాయాలతో పాటు ఆపరేషన్ థియేటర్లను పరిశీలించి ఈ గుర్తింపునిచ్చిందని పేర్కొన్నారు. భారతదేశంలో ఏ వైద్య కళాశాలకు ఈ గుర్తింపు రాలేదన్నారు. కార్యక్రమంలో జెమ్స్ కళాశాల సీఈఓ ఆద్విక్, సీఏఓ రామ్మోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీలలిత, మెడికల్ సూపరింటెండెంట్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల

- అంబేడ్కర్ వర్సిటీలో 16 పీజీ కోర్సులు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తులు స్వీకరణకు చివరి తేదీ మే 4

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర వ్యాప్త విశ్వవిద్యాలయాలు యూనిట్‌గా పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ ఏపీ పీజీసెట్ -2024 విడుదలైంది. ఈ పరీక్ష ద్వారా ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 16 పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఎకనామిక్స్, రూరల్ డెవలప్‌మెంట్, ఎంకాం, ఎంఎల్ఐఎస్సీ, ఇంగ్లిష్, ఎంఈడీ, ఎంఎస్‌డబ్ల్యూ, తెలుగు, ఎంజేఎంసీ, మ్యాథ్స్, అప్లైడ్ మ్యాథ్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలాటికల్ కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఫిజిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలతో పాటు జిల్లాలో మరో నాలుగు ప్రైవేట్ కళాశాలల్లో సైతం పీజీ కోర్సులు నిర్వహిస్తున్నారు. పీజీ సెట్ ఫీజు పరిశీలిస్తే ఓసీలకు రూ.850, బీసీలకు రూ.750, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.650గా నిర్ణయించారు. మే 5 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. రూ.500 అదనపు రుసుంతో మే 15 వరకు, రూ.1000 అదనపు రుసుంతో మే 25 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మే 27 నుంచి 29 వరకు మార్పులు-చేర్పులు, మే 31 నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం కల్పించారు. జూన్ 10 నుంచి 14 వరకు ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. పూర్తి వివరాలను వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్: //సీఈటీఎస్.ఏపీఎస్‌సీహెచ్ఈ.ఏపీ.జీవోవి.ఐఎన్‌లో పొందుపర్చారు.

కేజీబీవీ పరిశీలన

ఎచ్చెర్ల: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు మరింత ఉత్తమ ఫలితాలు సాధించేలా సిబ్బంది కృషిచేయాలని కేజీబీవీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌డీవీ రమణ అన్నారు. జీసీడీవో ఎస్.నీరజతో కలిసి మంగళవారం లావేరు మండలం మురపాక కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. పరికరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. పాఠశాల నిర్వహణ బాగానే ఉందని, ఇదే స్ఫూర్తితోమరింత అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.సుధా, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీ యూకేటీ) ఎస్ఎంపురం క్యాంపస్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆర్‌జీయూకేటీ విద్యార్థులు అత్యున్న స్థాయిలో ఉంటున్నారని చెప్పారు. ఉన్నత విద్య, ఉద్యోగాల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. ఇప్పటి నుంచే సివిల్స్, గ్రూప్స్, ఐఈఎస్ వంటి పోటీ పరీక్షలపై దృష్టి పెట్టాలని సూచించారు. సాంకేతిక, పారిశ్రామిక అంశాలపై పట్టు సాధించాలన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన, ఉత్తమ మానవ వనరులు సాధ్యమని వివరించారు. కార్యక్రమంలో ఎస్పీ జీఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డైరెక్టర్ కొక్కిరాల వెంకట ధనబాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈపై సీఎండీకి ఫిర్యాదు

టెక్కలి : టెక్కలి విద్యుత్ శాఖ ఏఈ ఈశ్వరరావు మండలంలో అక్రమంగా విద్యుత్ స్తంభాలు మార్పిడి చేయడమే కాకుండా ఆయా వినియోగదారుల నుంచి లక్షలాది రూపాయలు అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారంటూ టెక్కలి పట్టణానికి చెందిన ఉర్జాన విశ్వనాథం సీఎండీకి ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ అధికారుల ద్వారా దర్యాప్తు నిర్వహిస్తే తగిన ఆధారాలు ఇస్తానని ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్లుప్తంగా

గడ్డిమందు తాగి యువకుడి ఆత్మహత్య

డెంకాడ: మండలంలోని పినతాడివాడ గ్రామానికి చెందిన రెడ్డి రాజేష్‌కుమార్ (27) గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు హెచ్‌సీ సురేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తమ కళ్లం వద్ద రాజేష్‌కుమార్ సోమవారం గడ్డి మందు తాగేశాడు. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం విజయనగరంలోని ఆస్పత్రికి హుటాహుటిన తీసుకువెళ్లగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. మరణించిన రాజేష్‌కుమార్ ట్రాక్టర్ డ్రైవర్. డిగ్రీ చదువుకున్న కుమారుడు రాజేష్‌కుమార్‌కు కంపెనీలో ఉద్యోగం చూశాను. బుధవారం ఉద్యోగంలో చేరమని తండ్రి సత్యనారాయణ చెప్పాడు. ఇంతలో రాజేష్‌కుమార్ పురుగుమందు తాగేయడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు అంతులేని విషాదంలో మునిగిపోయారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని వెంకటరాయుని కోనేరులో సోమవారం గల్లంతైన మిండి ప్రభాస్(19) మృతిచెందాడు. ఎస్సై ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది, గజఈతగాళ్లు కోనేరులో సోమవారం నుంచి గాలింపు చేపట్టారు. అర్ధరాత్రి వరకు మత్స్యకారుల సహకారం తీసుకుని రాత్రి వరకు గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయానికి ప్రభాస్ మృతదేహం కోనేరులో తేలడంతో ఒడ్డుకు చేర్చారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

మూడు పశువుల మృత్యువాత



మృత్యువాత పడిన ఆవు

జామి: మండలంలోని ఎం.కె.వలస గ్రామంలో ఒకే రైతుకు చెందిన మూడు పశువులు మృత్యువాత పడ్డాయి, గ్రామానికి చెందిన చింతపల్లి కృష్ణ కళ్లంలో మంగళవారం ఉదయం పశువులకు నీరుపెట్టి వెళ్లిన కొంతసమయానికి ఒక ఆవు, రెండు గేదె పడ్డలు మృత్యువాత పడ్డాయి. దీంతో రైతు లబోదిబో మంటూ జామి పశువైద్యాధికారికి సమాచారం అందించాడు. పశువైద్యాధి కారి అప్పలనాయుడు, జిల్లా పశువ్యాధి నిర్ధారణశాఖ వైద్యాధికారులు రాం ప్రసాద్, లిఖిత గ్రామానికి వచ్చి మృత్యువాత పడిన పశువులకు పోస్ట్‌మార్టం నిర్వహించారు. మృత్యువాతకు గల కారణాలపై పరీక్షలు పూర్తిచేసి బుధవారం సాయంత్రం లోగా ఫలితాలు వెల్లడిస్తామని వారు తెలిపారు. సుమారు లక్ష రూపాయలు రైతుకు నష్టం జరిగింది.

1800 లీటర్ల బెల్లం ఊటల ధ్వంసం



సారా తయారీకి సిద్ధం చేసిన సామగ్రిని స్వాధీనం చేసుకున్న ఎస్సై ఫకృద్దీన్

వీరఘట్టం: మండలంలోని చినగోర గిరిజన ప్రాంతం శివారున సారా తయారీ కోసం ఉంచిన 1800 లీటర్ల పులిసిన బెల్లం ఊటలను మంగళవారం ధ్వంసం చేసినట్లు ఎస్సై ఫకృద్దీన్ తెలిపారు. అయితే సారా తయారీదారులు పరారయ్యారని, సారా తయారీకి వినియోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

8.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌లో భద్రపరుస్తున్న సీఎస్‌డీటీ రామారావు

విజయనగరం అర్బన్: ఉచిత రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునే చర్యలను జిల్లా పౌర సరఫరాల శాఖ కొనసాగించింది. ఈ మేరకు మండల శాఖ సిబ్బంది మంగళవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో మార్కెట్ ప్రాంతంలో ఆటోలో రవాణా చేస్తున్న పీడీఎస్ రేషన్ బియ్యం 8.50 క్వింటాళ్లు పట్టుబడ్డాయి. దీంతో పట్టుబడిన బియ్యాన్ని సీజ్ చేసి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు సివిల్ సప్లెస్ డీటీ రామారావు తెలిపారు.

సాంకేతిక విద్యకు తొలిమెట్టు పాలిటెక్నిక్

- జిల్లాలో 2 ప్రభుత్వ, 14 ప్రైవేట్ కళాశాలలు
- 28 కోర్సులు లభ్యం
- కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగ, ఉపాధి అవకాశం



విజయనగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

విజయనగరం రూరల్: సాంకేతిక విద్యకు తొలిమెట్టుగా పాలిటెక్నిక్ కళాశాలలు నిలుస్తున్నాయి. ఇంజినీరింగ్ విద్య కంటే తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్యను పాలిటెక్నిక్ కళాశాలలు అందిస్తున్నాయి. పాలిటెక్నిక్ చదివిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కచ్చితంగా లభిస్తున్నాయి. దీంతో పదో తరగతి పూర్తయిన వెంటనే విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

కంప్యూటర్‌తో పాటు అందుబాటులో మరిన్ని కోర్సులు

జిల్లాలో 2 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉండగా, 14 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో 28 కోర్సులు అందుబాటులో ఉండడంతో విద్యార్థులు తమకు నచ్చిన కోర్సును ఎంపిక చేసుకుని అందులో చేరుతున్నారు. కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, సివిల్, మెకానికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, కన్‌స్ట్రక్షన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, తదితర డిప్లమో కోర్సులను పాలిటెక్నిక్ కళాశాలలు అందిస్తున్నాయి. 3 ఏళ్ల పాటు ఈ కోర్సులను చదవాల్సి ఉంటుంది. అయితే పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు సీప్‌లో ర్యాంక్ సాధించాలి.

ప్రవేశం..అర్హతలు

విద్యార్థులు పదో తరగతి అర్హతతో పాలిసెట్ రాసి, ర్యాంకు ఆధారంగా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం పొందాల్సి ఉంటుంది. స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో నిర్వహించే పాలిసెట్–2024 ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 5వ తేదీ ఆఖరు కాగా, ఇదే నెల 27న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు.



విద్యార్థికి నియామక పత్రం అందిస్తున్న దృశ్యం

ఏటా 4 వేలమందికి పైగా చేరిక

జిల్లా పరిధిలోని విజయనగరం, చీపురుపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 480 మంది వివిధ కోర్సుల్లో చేరగా 14 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో మరో 3,500 మందికి పైగా విద్యార్థులు వివిధ కోర్సుల్లో చేరుతున్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరం

తక్కువ ఖర్చుతో ఇంజినీరింగ్ విద్య వైపు అడుగులు వేసేందుకు పాలిటెక్నిక్ విద్య ఉపయోగపడడంతో గ్రామీణ, మధ్య తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్ విద్య వరంగా ఉంటుందని చెప్పొచ్చు. పాలిటెక్నిక్ విద్య మూడేళ్ల కోర్సు పూర్తయితే ఈ సెట్ పరీక్ష రాసి నేరుగా ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో విద్యార్థులు చేరొచ్చు. పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రాక్టికల్స్‌కు ఎక్కువగా అవకాశం ఉండడంతో విద్యార్థులకు త్వరితగతిన కంపెనీల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా లభిస్తాయి. డిమాండ్ ఉన్న కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు కార్పొరేట్ కంపెనీలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. ఈ ఐదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కళాశాలలో 14 జాబ్‌మేళాలు, క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి సుమారు 200 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. వీటితోపాటు సచివాలయాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో కొలువులు సాధించిన వారు అదనం.

పాలిటెక్నిక్ కోర్సుతో మేలు



పాలిటెక్నిక్ విద్యతో యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. క్యాంపస్ ఇంటర్వ్యూలతో పాటు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో పలు జాబ్ మేళాలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్య అందించడంతో పేద విద్యార్థులకు మేలు కలుగుతుంది. రెండు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 6 డిప్లమో కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

– జి.ఆశారమణి, ప్రిన్సిపాల్, ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

చంద్రబాబుకు వృద్ధుల ఉసురు తప్పదు



గోపన్నవలస ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

- ఎన్నికల ప్రచార సభలో విద్యాశాఖ మంత్రి బొత్ససత్యనారాయణ

మెరకముడిదాం: పింఛన్ తీసుకుంటున్న వయోవృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఉసురు చంద్రబాబు పోసుకుంటున్నారని వారి ఉసురు చంద్రబాబుకు తగలక తప్పదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి మెరకముడిదాం మండలంలోని సోమలింగాపురం పంచాయతీ మధుర గ్రామమైన గోపన్నవలసలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి అనేక సంక్షేమ పథకాల కింద మహిళల ఖాతాల్లోకి నేరుగా ఎలాంటి అవినీతి లేకుండా డబ్బులు జమ చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. గోపన్నవలస గ్రామంతో పాటు మెరకముడిదాం మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసింది తమ ప్రభుత్వమేనన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు అండ్ కో చీపురుపల్లి నియోజకవర్గానికి గానీ మెరకముడిదాం మండలానికి గానీ ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను కూడా నవరత్నాల ద్వారా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆర్థికంగా చేయూత నిచ్చారన్నారు.

ప్రతిపక్షానివి మోసపూరిత హామీలు

టీడీపీ నాయకులు ఎన్నికలు వచ్చేసరికి గ్రామాల్లో తిరుగుతూ తమకు అధికారం ఇస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని అంటున్నారని గతంలో ఇలాంటి మోసపూరిత హామీలిచ్చి ఎన్నికలైన తరువాత అధికారం చేజిక్కించుకుని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదన్నారు. మళ్లీ ఎన్నికలు వచ్చే సరికి గ్రామాల్లోకి వచ్చి మోసపూరిత హామీలిచ్చి ఓటు అడుగుతున్నారన్నారు. ఒక్కసారి మంచి ఆలోచనతో మీ ఎదురుగా కనిపిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎవరి హయాంలో వచ్చాయో బేరీజు వేసుకుని ఎవరు మంచి చేస్తే వారికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్వీ రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కేఏస్ఆర్‌కే ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, వైస్ ఎంపీపీ టి.హరిబాబు పప్పల కృష్ణమూర్తి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు

- నదుపాయాల కల్పనకు సాక్ష్యం యాప్
- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల్లో పాల్గొనే విభిన్న ప్రతిభావంతులకు ఎన్నికల కమిషన్ పలు ప్రత్యేక సౌకర్యాలను కల్పిస్తోందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుని జిల్లాలోని దివ్యాంగులంతా శతశాతం వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కలెక్టర్, విజయనగరం జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి అధ్యక్షతన కలెక్టర్ చాంబర్‌లో డీఎంసీఏఓ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఎన్నికల్లో దివ్యాంగులకు కల్పించనున్న సౌకర్యాలపై చర్చించారు. దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ దివ్యాంగులకు కల్పిస్తున్న ప్రత్యేక సదుపాయాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలను గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల కోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా రూపొందించిన సాక్ష్యం యాప్, ఎంతో సహాయకారిగా ఉంటుందని, దీనిని ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని కలెక్టర్ కోరారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్

హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

ఓటరు జాబితాలో దివ్యాంగులుగా నమోదై ఉండి, సదరం ధ్రువీకరణ పత్రం ప్రకారం తమకు 40 శాతం పైబడి వికలాంగత్వం ఉంటే వారు ఇంటివద్దనుంచే ఓటు వేసే అవకాశం ఉందన్నారు. సాక్ష్యం యాప్ ద్వారా హోమ్ ఓటింగ్ కోసం ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే పోలింగ్ కేంద్రానికి చేరుకోవడానికి రవాణా సౌకర్యం కావాలన్నా, ఓటరు జాబితాలో పేరు తెలుసుకోవాలన్నా తమ పోలింగ్ కేంద్రం వివరాలను తెలుసుకోవాలన్నా వీల్ చైర్, వలంటీర్ సౌకర్యం కావాల్సివచ్చినా ఈ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వాయిస్ అసిస్టెంట్, టెక్ట్స్ టు స్పీచ్ తదితర సదుపాయాలు కూడా ఈ యాప్‌లో ఉన్నాయని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 580 వీల్ చైర్లను ఎన్నికల రోజు అందుబాటులో ఉంచుతామని చెప్పారు.

వలంటీర్లుగా ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు

18 ఏళ్లలోపు వయసు గల ఎన్‌సీసీ, ఎస్ఎస్ఎస్ క్యాడెట్లను నియమిస్తామని తెలిపారు. అంధులకు బ్రెయిలీ లిపిలో ఓటర్ స్లిప్పులను పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సుమారు 10,550 మంది అంధులు ఓటరు జాబితాలో నమోదై ఉన్నారన్నారు. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రం వద్దా బ్రెయిలీ లిపిలో నమూనా బ్యాలెట్ పేపర్‌ను ఏర్పాటు చేస్తామని, దాని ద్వారా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయవచ్చునని తెలిపారు. ఈవీఎంలపైనా బ్రెయిలీ లిపిలో నంబర్లు ఉంటాయన్నారు. లేదా వలంటీర్‌ను ఉపయోగించుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని సూచించారు. చూపు తక్కువగా ఉన్న వారి కోసం భూతద్దాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఐదు దశల్లో ఓటు వేసే ప్రక్రియ పూర్తవుతుందని, ఇది కూడా చాలావరకు విభిన్న ప్రతిభావంతులకు అనుకూలంగానే రూపొందించినట్లు వివరించారు. సమావేశంలో జేసీ కె.కార్తీక్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఎ.డి జీవీబీ జగదీష్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, సాంఘిక సంక్షేమాధికారి రామానందం, విద్యాశాఖ ఎ.డి బి.గౌరీశంకర్, కమిటీ సభ్యులు, సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యమే అసలైన సంపద

విజయనగరం రూరల్: ఒత్తిడి లేకుండా ఆరోగ్యకరమైన జీవన విధానమే మానవునికి అసలైన సంపదని విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిషన్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.అప్పలనాయుడు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాకోడు పీహెచ్‌సీలో 'మన ఆరోగ్యం –మన హక్కు' అంశంపై ఆశ కార్యకర్తలకు మంగళవారం అవగాహన కల్పించారు. గ్రామాల్లో బహిరంగ మలవిసర్జనతో టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు మరుగుదొడ్లు వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. దూమపానానికి దూరంగా ఉండేవారికి క్యాన్సర్ సోకే అవకాశం లేదన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, డాక్టర్ వాహిణి, రాకోడు వైద్యాధికారిణి శ్రావణి, పలువురు వైద్యులు, రాకోడు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కోలగట్లకే మా మద్దతు

- నగర పాల వర్తకుల సంఘం ప్రతినిధుల వెల్లడి
- టీడీపీ, జనసేనల నుంచి 60 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ, జనసేనల నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో పార్టీ నాయకులు

విజయగనరం: సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కోలగట్ల వీరభద్ర స్వామి విజయానికి తమ వంతు కృషి చేస్తామని నగర పాలక వర్తకుల సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ మేరకు కోలగట్ల వీరభద్రస్వామికి సంఘీభావంగా టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరారు. ఆ పార్టీలకు చెందిన 60 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరగా..జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మన్యాల కృష్ణ వారందరికీ పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేష్, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కంటుభక్త తవిటి రాజు పార్టీలో చేరిన వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మన్యాల కృష్ణ మాట్లాడుతూ నిత్యం పాల వ్యాపారంలో కష్టపడి పనిచేసిన వారికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఎంతోమందికి కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా రుణాలు మంజూరు చేశామని చెప్పారు. పేదలకు అండగా నిలుస్తూ వైఎస్ఆర్‌సీపీ పాలనలో తనదైన మార్కును ఎన్నో సందర్భాల్లో రుజువు చేసుకదని గుర్తు చేశారు. అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం ప్రజా సేవలో మమేకమవుతున్న కోలగట్ల వీరభద్ర స్వామిని గెలిపించుకోవడం నియోజకవర్గం ప్రజల అవసరమన్నారు. కార్యక్రమంలో జగదీష్, బోండా శ్రీను, నాగరాజు, పొంతపల్లి మురళి, సూరిబాబు, మరుకుర్తి రాజు, బోని కృష్ణ, సురేష్, పవన్, వెంకట గురువు తదితరులు పాల్గొన్నారు.

4వ తేదీ నుంచి పింఛన్ల పంపిణీ

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ నెల 4వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. ఆయా సచివాలయాల వద్ద ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పింఛన్ మొత్తాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయా గ్రామ, వార్డు సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో ఈ నెల 3వ తేదీన పింఛన్ మొత్తాలకు సంబంధించిన నిధులు జమ అవుతాయని వాటిని మండలాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ, విద్యా సహాయకులు, పట్టణ ప్రాంతాల్లో వార్డుల పరిపాలన కార్యదర్శులు, సంక్షేమ కార్యదర్శులు ఈ నగదు మొత్తాలను విత్‌డ్రా చేసి పింఛన్ మొత్తాలు పంపిణీ చేసే సచివాలయ సిబ్బందికి అందజేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 6వ తేదీ నాటికి అన్ని మండలాలు, మునిసిపాలిటీల్లో పింఛన్ల పంపిణీ పూర్తిచేయాలని స్పష్టం చేశారు.

5న అండర్-17 జిల్లా స్థాయి చెస్ పోటీలు

విజయనగరం: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో ఈ నెల 5న జిల్లాస్థాయి అండర్–17 బాల, బాలికల చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ. జ్వాలాముఖి మంగళవారం తెలిపారు. నగరంలోని ప్రదీప్‌నగర్‌లో గల ప్రజా గ్రంథాలయంలో ఆ రోజు ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని ఈ మేరకు ఆయన పేర్కొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫైర్ చెస్ స్కూల్, న్యూ హరిజన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో అర్హత, ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9182615056 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ ఆశీర్వదించండి

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

పాచిపెంట: సంక్షేమ సారథి, అభివృద్ధి వారధి అయిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన పాచిపెంట మండలంలోని పాంచాలి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శనాపతి నారాయణరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ గ్రామానికి వచ్చిన ప్రియతమ నేత రాజన్నదొరకు ప్రజలు, నాయకులు బ్రహ్మరథం పట్టారు. పూలమాలలు వేసి హారతి ఇచ్చి రాజన్నదొరకు ఘనంగా స్వాగతం పలికి అభిమానం చాటుకున్నారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా అత్యంత పారదర్శకంగా లక్షల కోట్ల రూపాయలను వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జమచేశారన్నారు. ప్రతి ఇంటికి ఓ పెద్దకొడుకులా, ఓ సోదరుడిలా అండగా నిలిచారని గుర్తుచేశారు. ప్రజలకు మంచి చేసింది జగన్‌మోహన్ రెడ్డి కాగా, ప్రజలను మోసం చేసింది చంద్రబాబు అని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు, వైస్ఎంపీపీ కొరిపల్లి రవీంద్ర, ప్రజాప్రతినిధులు, నాయకులు, యజ్జల వెంకటరావు, బోను ధనుంజయ, మూకల అప్పారావు, దండి కొండలరావు, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

పుష్పాలంకరణలో పైడితల్లి



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, నేతేటి ప్రశాంత్‌లు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి గ్రామానికి సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నట్లు బొబ్బిలి రైల్వే హెచ్‌సీ బి.ఈశ్వర్రావు తెలిపారు. ఈ ఘటనపై ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందినట్లు రైల్వేస్టేషన్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. మృతుని వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. మృతుని శరీరంపై ముదురునీలి రంగు లుంగీ, నీలం ఆకుపచ్చ టీషర్టు ఉన్నాయని, మృతుడి వద్ద మరే ఇతర ఆధారాలు లేవని చెప్పారు. మృతదేహాన్ని విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు విజయనగరం రైల్వే ఎస్సై రవివర్మను గానీ, బొబ్బిలి రైల్వే పోలీసులను గానీ సంప్రదించాలని సూచించారు. వివరాలు తెలిసిన వారు ఫోన్ 9490617089,9491813163 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో 35 కుటుంబాల చేరిక



బాలేరులో పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



లివిరిలో పార్టీలో చేరిన కార్యకర్తలకు కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: మండలంలోని బాలేరు, లివిరి గొల్లకాలనీకి చెందిన 35 టీడీపీ కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరారు. జగనన్న పాలన మెచ్చిన లివిరి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బొల్ల ఆదినారాయణ, ఈగల శేఖర్, బొల్ల తిరుపతి, తోణంగి ఢిల్లీ, బెవర కృష్ణారావు, గౌడో సురేష్, తామాడ రామారావు, ఈగల లక్ష్మణ, బొల్ల చొట్టన్నలు పాలకొండ శాసనసభ్యురాలు విశ్వాసరాయి కళావతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలంల సమక్షంలో పార్టీలో చేరారు.వీరికి కండువాలు కప్పి ఎమ్మెల్యే కళావతి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించా రు. అలాగే బాలేరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు గువ్వాడ రామదాస్, కోనాడ అప్పారావు, మహిళా నాయకులు గొటివాడ లక్ష్మి, గువ్వాడ సరస్వతిల ఆధ్వర్యంలో పలు కుటుంబాలు వైఎస్సాఆర్‌సీపీలో చేరగా వారికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపీటీసీలు కొత్తకోట చంద్రశేఖర్, పాలక ఉషారాణి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మేడిబోయిన శ్రీవేణి, జెడ్పీటీసీ బొడ్డేపల్లి చిన్నమ్మిల ఆధ్వర్యంలో పార్టీలో చేరికలు జరిగాయి.

వడదెబ్బపై అవగాహన కల్పించండి



ఆశ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

- డీఎంహెచ్ఓ భాస్కరరావు

గజపతినగరం రూరల్: వేసవి తీవ్రత దృష్ట్యా వడదెబ్బపై విస్తృత స్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి భాస్కరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని మరుపల్లి ప్రాథమిక ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రిలో జరుగుతున్న ఆశాడే కార్యక్రమంలో చెబుతున్న అంశాలను తు.చ తప్పకుండా పాటించాలని సూచించారు. ఆశ కార్యకర్తలు మొబైల్‌లో లాగిన్ అయ్యే విధంగా బాధ్యతతో మెలగాలని చెప్పారు. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి రోగులను గుర్తించాలని, అలాగే ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఆస్పత్రిలో వైద్యసిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు సేవలను అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు డా.సాయికృష్ణారెడ్డి, అనూజ్ రాయ్, డా.సుష్మ, చంద్రశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.